


ఎన్‌సిసి క్యాడెట్లు సేవా దృక్పథంతో మెలగాలి

ప్రజాశక్తి - చింతలపూడి

ఎన్‌సిసి క్యాడెట్లు సమాజం పట్ల సేవా దృక్పథంతో మెలగాలని ఎన్‌సిసి అధికారి లెఫ్టినెంట్ జి.జీవన్‌మౌనిక అన్నారు. సేవా కార్యక్రమాలు చేయడం ద్వారా క్యాడెట్లలో నాయకత్వ లక్షణాలు పెరుగుతాయన్నారు. స్థానిక చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సిసి కాడెట్లు బట్టువారిగూడెంలో ఉన్న లిటిల్ చిల్డ్రన్ హోమ్‌ను కళాశాల ఎన్‌సిసి అధికారి లెఫ్టినెంట్ జి.జీవన్ మౌనిక ఆధ్వర్యంలో శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎన్‌సిసి క్యాడెట్లు విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకోవడం కోసం వివిధ రకాలైన సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా లెఫ్టినెంట్ జి.జీవన్‌మౌనిక మాట్లాడుతూ సామాజిక సేవ, సమాజాభివృద్ధి ఎన్‌సిసి శిక్షణలో భాగమని, దీనిని ప్రతి క్యాడెట్ అలవర్చుకోవాలని చెప్పారు.

బాబు.. పద్దు పలికేనా..!



- పోలవరం నిర్వాసితులకు నిధులు కేటాయించేనా
- చింతలపూడి, తాడిపూడికి నిధులిస్తారా
- ఐదేళ్లుగా పడకేసిన డెల్టా ఆధునికీకరణకు కేటాయింపులుండేనా
- ఆక్వా, పామాయిల్, వరి రైతులకు ప్రోత్సాహకాలు దక్కేనా
- కొల్లేరు రెగ్యులేటర్ల నిర్మాణానికి నిధులిచ్చేనా
- రేపు అసెంబ్లీలో పూర్తిస్థాయి బడ్జెట్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కూటమి సర్కార్ సోమవారం అసెంబ్లీలో ప్రవేశ పెడుతున్న తొలి పూర్తిస్థాయి బడ్జెట్‌లో జిల్లాకు నిధుల కేటాయింపుపై జనాల్లో తీవ్ర చర్చ సాగుతోంది. గడిచిన ఎన్నికల్లో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని అన్ని స్థానాలను టిడిపి కూటమి కైవసం చేసుకుంది. ఎన్నికల ప్రచారంలో ఉమ్మడి పశ్చిమను అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తామని కూటమి నేతలు హామీలిచ్చారు. జిల్లాలో చింతలపూడి, తాడిపూడి వంటి సాగునీటి ప్రాజెక్టులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉండిపోయాయి. పోలవరం నిర్వాసితుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఐదేళ్లుగా డెల్టా ఆధునికీకరణ పనులు ముందుకు సాగని పరిస్థితి ఉంది. కొల్లేరు రెగ్యులేటర్ నిర్మాణం, నరసాపురం ప్రాంతంలో ఫిషింగ్ హార్బర్ మాటలకే పరిమితమయ్యాయి. ఆక్వా, పామాయిల్, వరి రైతులకు ప్రోత్సాహకాలు లేకుండాపోయాయి. బడ్జెట్‌లో నిధులు కేటాయించి జిల్లా అభివృద్ధికి కూటమి సర్కార్ అండగా నిలబడుతుందా?.. లేదో చూడాల్సి ఉంది.

గడిచిన ఎన్నికల్లో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని 14 అసెంబ్లీ, రెండు పార్లమెంట్ స్థానాలను టిడిపి కూటమికి జనం కట్టబెట్టారు. దీంతో ఇక జిల్లా అభివృద్ధి పరుగులు తీస్తుందని జనం ఆశలు పెట్టుకున్నారు. పూర్తిస్థాయి బడ్జెట్ పెట్టనుండటంతో జిల్లాలోని ప్రధాన సమస్యలకు సంబంధించి నిధులు కేటాయిస్తుందని జిల్లా ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. ముఖ్యంగా కూటమి సర్కార్ ఇచ్చిన హామీల్లో పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయడం. అందుకు సంబంధించిన నిధులు కేంద్రమే ముందుకు తీసుకొస్తున్న పరిస్థితి. కేంద్రం నుంచి రూ.12 వేల కోట్లు వస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. పోలవరం ప్రాజెక్టులో ప్రధాన సమస్య నిర్వాసితులు. ఏలూరు జిల్లాలో 107 గ్రామాలకు సంబంధించి 21 వేల కుటుంబాలను తరలించాల్సి ఉంది. సర్వం కోల్పోతున్న నిర్వాసితులకు పరిహారం ఇచ్చి తరలించిన తర్వాతే ప్రాజెక్టు పనులు ముందుకు సాగించాల్సి ఉంది. ప్రాజెక్టు నిర్మాణానికి ఎంత ఖర్చులో అగ్రభాగం దాదాపు రూ.33 వేల కోట్లు నిర్వాసితులకే ఇవ్వాల్సి ఉంది. కేంద్రం ఇచ్చినట్లు చెబుతున్న నిధుల్లో నిర్వాసితులకు ఎంత కేటాయించారో బడ్జెట్‌లో చెబుతారో లేదో చూడాలి. గత వైసిపి ప్రభుత్వం నిర్వాసితులను తీవ్రంగా వంచించింది. పునరావాస ప్యాకేజీ రూ.పది లక్షలకు పెంచుతామని, 2006లో సేకరించిన భూములకు ఎకరాకు రూ.ఐదు లక్షలు ఇస్తామని, 18 ఏళ్ల నిండిన యువతకు పరిహారం ఇస్తామని అనేక హామీలు ఇచ్చింది. ఐదేళ్ల పాలనలో ఏ ఒక్క హామీని నెరవేర్చలేదు. తాము అధికారంలోకి వస్తే పోలవరం నిర్వాసితులకు న్యాయం చేస్తామని సిఎం చంద్రబాబుతోపాటు డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ ఎన్నికల్లో హామీ ఇచ్చారు. జనసేన ఎంఎల్ఎను అక్కడి ప్రజలు గెలిపించారు. బడ్జెట్‌లో పునరావాసానికి నిధులు ఎంతమేర కేటాయిస్తారో వేచిచూడాలి.

చింతలపూడి, తాడిపూడికి నిధులిచ్చేనా?

చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తయితే ఉమ్మడి పశ్చిమ, కృష్ణ జిల్లాలోని 4.60 లక్షల ఎకరాలకు, తాడిపూడి ప్రాజెక్టులో పిల్ల కాలువల తవ్వకాలు పూర్తి చేస్తే మరో 2.60 లక్షల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉంది. దశాబ్దాలు గడిచినా ఈ ప్రాజెక్టులు పూర్తికాని పరిస్థితి. రాష్ట్రంలో ఆరు సాగునీటి ప్రాజెక్టులను ప్రధానంగా తీసుకుంటున్నట్లు కూటమి సర్కార్ తెలిపింది. అందులో చింతలపూడి ప్రాజెక్టు ఉన్నట్లు చెప్పారు. చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని రెండు దశల్లో పూర్తి చేయనున్నట్లు తెలిపారు. అందుకు రూ.3,782 కోట్లు అవసరమని జలవనరుల శాఖ అంచనా వేసింది. జల్లేరు జలాశయం పనులు రెండోదశలో చేపడతారు. 2026 జూన్‌కు తొలి దశ పనులు పూర్తి చేస్తామని ప్రభుత్వం తెలిపింది. బడ్జెట్‌లో దీనికి సంబంధించిన నిధులు కేటాయిస్తారా, లేదా అనేది చూడాల్సి ఉంది. తాడిపూడి ప్రాజెక్టు 2006లో ప్రారంభమైంది. ఇప్పటికీ పిల్ల కాలువలు పూర్తికాలేదు. మరో రూ.200 కోట్లు కేటాయిస్తే పనులు చాలా వరకూ కొలిక్కి వచ్చే పరిస్థితి ఉన్నట్లు చెబుతున్నారు. బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని తాడిపూడి ప్రాజెక్టు కింద సాగునీరు కోసం ఎదురుచూస్తున్న రైతులు కోరుతున్నారు.

ఫిషింగ్ హార్బర్, కొల్లేరు రెగ్యులేటర్ నిర్మాణానికి నిధులిస్తారా

నరసాపురం మండలం బియ్యపుతిప్పలో ఫిషింగ్ హార్బర్ నిర్మిస్తామని 2014-19 మధ్య టిడిపి ప్రభుత్వం, 2019-24 మధ్య వైసిపి ప్రభుత్వం చెప్పాయి. ఇప్పటి వరకూ ఒక్క అడుగూ ముందుకు పడలేదు. కొల్లేరులో రెగ్యులేటర్ల నిర్మాణంపై వైసిపి ప్రభుత్వం పెద్దఎత్తున హడావిడి చేసి వదిలేసింది. కూటమి సర్కార్ ఫిషింగ్ హార్బర్, రెగ్యులేటర్ల నిర్మాణంపై దృష్టి సారించి, నిధులు కేటాయించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

రైతులకు ప్రోత్సాహకాలు లభించేనా


జిల్లాలో అతిపెద్ద సాగుగా వరి, రెండు లక్షల ఎకరాల్లో ఆక్వా, లక్షన్నర ఎకరాల్లో పామాయిల్ ఉన్నాయి. ఆక్వా రైతులకు మేత ధరలు పెరిగిపోవడం, రొయ్యకు సరైన ధర లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. విద్యుత్ సబ్సిడీ సైతం అందరికీ అందించడం లేదు. వరి రైతులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారు. ఆక్వా, పామాయిల్, వరి రైతులకు ఉపయోగపడేలా బడ్జెట్‌లో ఏమైనా ప్రోత్సాహకాలు ప్రకటించాలని రైతాంగం కోరుకుంటుంది. కూటమి సర్కార్ ఏవిధంగా ముందుకు సాగుతుందో వేచిచూడాలి.

పడకేసిన డెల్టా ఆధునికీకరణ

ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఖరీఫ్, రబీలో దాదాపు పది లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. 11 ప్రధాన కాలువలు, 300కిపైగా ఉప కాలువల ద్వారా సాగునీరు సరఫరా జరుగుతోంది. 2007లో అప్పటి ప్రభుత్వం డెల్టా ఆధునికీకరణకు రూ.1,416 కోట్లు కేటాయిస్తూ ఆమోద ముద్ర వేసింది. దాదాపు రూ.800 కోట్లు వరకూ ఖర్చుపెట్టారు. ఇంకా రూ.600 కోట్లకుపైగా ఖర్చు చేయాల్సి ఉంది. పెరిగిన ధరలతో ఇప్పుడు రూ.వెయ్యి కోట్లు ఖర్చు చేస్తే తప్ప డెల్టా ఆధునికీకరణ పూర్తయ్యే పరిస్థితి లేదు. వైసిపి ప్రభుత్వం ఐదేళ్లలో డెల్టా ఆధునికీకరణకు ఒక పైసా విదల్చలేదు. దీంతో కాలువలు పూడుకు పోయాయి. ప్రతియేటా వర్షాలు, వరదలకు లక్షల ఎకరాల్లో పంట దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. బడ్జెట్‌లో ఆధునికీకరణకు నిధులు కేటాయిస్తే ఏప్రిల్‌లో కాల్వలు కట్టేసిన తర్వాత పనులు ప్రారంభించి ముందుకు సాగడానికి వీలుంటుంది. కూటమి సర్కార్ నిధులు కేటాయిస్తుందో, లేదో చూడాలి.

ఆర్‌టిసి రీజనల్ బోర్డు ఛైర్మన్‌గా అప్పలనాయుడు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ



ఎపిఎస్ ఆర్‌టిసి రీజనల్ (విజయవాడ) బోర్డు ఛైర్మన్‌గా రెడ్డి అప్పలనాయుడు నియ మితులయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం శనివారం విడుదల చేసిన నామినేటెడ్ పదవుల నియామక జాబితాలో అప్పలనాయుడికి ఈ పదవి దక్కింది. కార్మిక నేతగా పేరొందిన అప్పలనాయుడు జనసేన తరఫున 2019 అసెంబ్లీ ఎన్నికల్లో ఏలూరు ఎంఎల్ఎ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. తర్వాత ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఆ పార్టీని అంటిపెట్టుకుని కార్యక్రమాలు క్రియాశీలంగా నిర్వహించారు. గత ఎన్నికల్లో కూటమి పొత్తు వల్ల ఏలూరు సీటు టిడిపికి దక్కింది. దాంతో అప్పలనాయుడికి పోటీ చేసే అవకాశం దక్కలేదు. అయినప్పటికీ జనసేన తరఫున టిడిపి అభ్యర్థి బడేటి చంటి గెలుపునకు కృషి చేశారు. ఈ క్రమంలో ఆయనకు నామినేటెడ్ పదవి దక్కింది. ఈ సందర్భంగా కూటమి ప్రభుత్వానికి రెడ్డి అప్పలనాయుడు కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి మూడు పార్టీల్లో కష్టపడిన సామాన్యులకు ప్రాధాన్యతనిస్తున్నారని ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రెడ్డి అప్పలనాయుడిని పలువురు జనసేన నాయకులు, కూటమి నాయకులు ఆయన నివాసంలో కలిసి అభినందనలు తెలిపారు.

ధాన్యం సొమ్ము 48 గంటల్లో జమ

ఇప్పటి వరకూ 2,220 టన్నుల ధాన్యం కొనుగోలు

రూ.కోటీ 92 లక్షలు రైతుల ఖాతాల్లో జమ

అందుబాటులో అవసరమైనన్ని గోనె సంచులు

ధాన్యం రవాణా వాహనాలపై నిరంతరం పర్యవేక్షణ

సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ శ్రీలక్ష్మి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి



ధాన్యం విక్రయించిన 48 గంటల్లోనే ప్రభుత్వం రైతుల ఖాతాల్లో సొమ్ము జమ చేస్తుందని, ఖరీఫ్ ధాన్యం కొనుగోలులో రైతులకు ఎటువంటి ఇబ్బందుల్లేకుండా అన్ని చర్యలూ తీసుకున్నామని సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ శ్రీలక్ష్మి తెలిపారు. ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లు మమ్మురమవుతున్న నేపథ్యంలో 'ప్రజాశక్తి' నిర్వహించిన ముఖాముఖిలో ఆమె మాట్లాడారు. ఇప్పటి వరకూ కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు, సొమ్ము జమ, ఏ మండలాల్లో ధాన్యం కొనుగోలు చేశారు, గోనె సంచుల కొరత లేకుండా తీసుకున్న జాగ్రత్తలు, రైతుసేవా కేంద్రాలకు మిల్లుల ట్యాగింగ్‌కు సంబంధించిన వివరాలు, ధాన్యం రవాణా వాహనాలపై నిరంతర పర్యవేక్షణ వంటి పలు అంశాలపై ఆమె వివరించారు.

ప్రశ్న: ఖరీఫ్ సీజన్‌లో ఎన్ని లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నారు. అందుకు సంబంధించి కొనుగోలు కేంద్రాలు ఎన్ని ఏర్పాటు చేశారు?



డిఎం: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో 3.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా పెట్టుకున్నాం. జిల్లాలో మొత్తం 250 రైతుసేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేశాం.

ప్రశ్న: ఇప్పటి వరకూ ఎంతమేర ధాన్యం కొనుగోలు చేశారు. ఏయే మండలాల్లో ఎక్కువగా చేశారు. ధాన్యం సొమ్ము రైతుల ఖాతాల్లో జమైందా?

డిఎం: ఇప్పటి వరకూ 261 మంది రైతుల నుంచి 34 కొనుగోలు కేంద్రాల్లో 2,200 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం. భీమడోలు, దెందులూరు, పెదపాడు, ముదినేపల్లి, మండవల్లి, ఉంగుటూరు, ద్వారకాతిరుమల, జంగారెడ్డిగూడెం, చాట్రాయి మండలాల్లో ధాన్యం కొనుగోలు జరిగింది. మొత్తం రూ.5.12 కోట్లు విలువ చేసే ధాన్యం కొనుగోలు చేయగా ఇప్పటికే రైతుల ఖాతాల్లో రూ.కోటీ 92 లక్షలు సొమ్ము జమైంది. మిగిలిన రూ.3.18 కోట్లు జమవుతున్నాయి.

ప్రశ్న: జిల్లాలో ఎన్ని రైసుమిల్లులు ఉన్నాయి. ఏవిధంగా ట్యాగ్ చేశారు?

డిఎం: జిల్లాలో మొత్తం 99 రైసుమిల్లులు ఉన్నాయి. ముందుగా ఆయా మండలాల్లోని రైతుసేవా కేంద్రాలకు స్థానిక మిల్లులను ట్యాగ్ చేశారు. తక్కువగా మిల్లులు ఉంటే ఇతర మండలాల్లోని మిల్లులను ట్యాగ్ చేశారు. ఏదైనా ఇబ్బంది ఉందని, తహశీల్దార్, మండల వ్యవసాయశాఖ అధికారి గుర్తించి తీర్మానం చేసి పంపిస్తే డిఎస్ఒ మిల్లుల ట్యాగింగ్‌కు సంబంధించి నిర్ణయం తీసుకుని చర్యలు తీసుకుంటారు.

ప్రశ్న: గతంలో సంచుల కొరత తీవ్రంగా వేధించింది. ఇప్పుడు సంచుల సమస్య ఏమైనా ఉందా?

డిఎం: రైతుసేవా కేంద్రాల వద్ద 21 లక్షల సంచులు అందుబాటులో ఉన్నాయి. 4.20 లక్షల సంచులు గొడౌన్లలో ఉన్నాయి. 43 లక్షల సంచులు నాణ్యత తనిఖీ చేసి అందుబాటులో పెట్టాం. సంచుల కొరత అనే సమస్య లేకుండా చర్యలు తీసుకున్నాం. సంచుల నాణ్యతపై జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించి చర్యలు తీసుకున్నారు. చిల్లుల సంచులు లేకుండా చర్యలు తీసుకున్నాం.

ప్రశ్న: గతంలో తేమశాతం నిర్ధారణపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ఇబ్బందుల్లేకుండా ఏమైనా చర్యలు తీసుకున్నారా?

డిఎం: తేమశాతం నిర్ధారణపై రైతులకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా చర్యలు తీసుకున్నాం. ధాన్యం కొనుగోలు చేసే రైతుసేవా కేంద్రాల వద్ద, మిల్లుల వద్ద తేమశాతం నిర్ధారణ మిషన్లు పెట్టడం జరిగింది. అంతేకాకుండా తహశీల్దార్ వద్ద అదనంగా మరో 20 మిషన్లు ఉంచాం. అదనంగా మరో 30 మిషన్లు అందుబాటులో ఉంచాం. తేమశాతం నిర్ధారణలో రైతులకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా చేశాం.

ప్రశ్న: హమాలీ, రవాణా ఛార్జీలు రైతుల ఖాతాల్లోనే వేస్తారా?

డిఎం: హమాలీ, రవాణా ఛార్జీలు, సంచులు రైతులే సమకూర్చుకుంటే ఆ సొమ్ము రైతుల ఖాతాల్లోనే వేస్తాం. సొసైటీలు ఆ బిల్లులు పెట్టుకోవడం కుదరదు. ధాన్యం సొమ్ము జమైన రోజుల వ్యవధిలోనే ఈ సొమ్ము సైతం రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నారు.

ప్రశ్న: గతంలో ధాన్యం తరలింపులో వాహనాల సమస్య తీవ్రంగా వేధించింది. దీనికి సంబంధించి ఎటువంటి చర్యలు తీసుకున్నారు?

డిఎం: రవాణాకు సంబంధించి ఎటువంటి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకున్నాం. ధాన్యం రవాణా చేసే అన్ని వాహనాలకూ జియో ట్యాగింగ్ ఏర్పాటు చేశాం. నిరంతరం ఆ వాహనాలను పర్యవేక్షిస్తున్నాం. వాహనం ఎక్కడైనా ఆలస్యమైతే వెంటనే తెలిసిపోతుంది. వెంటనే తగు చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: రైతులకు ఏం చెప్పదలచుకున్నారు?

డిఎం: ధాన్యం కొనుగోలుకు సంబంధించి ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఆదేశాలతో అన్ని చర్యలు తీసుకున్నాం. ఏమైనా ఇబ్బందులుంటే రైతులు ఫోన్ చేసి చెప్పొచ్చు. రైతులు ఎటువంటి ఇబ్బందులూ పడాల్సిన అవసరం లేకుండా ధాన్యం విక్రయించుకోవచ్చు.

ఆదివాసీల భూములకు హక్కు పట్టాలివ్వాలి

సిపిఎం మండల మహాసభలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

తరతరాలుగా ఆదివాసీలు సాగు చేస్తున్న ఎల్‌టిఆర్, 1/70 చట్టం భూములకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే హక్కు పట్టాలు ఇవ్వాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని రెడ్డిగణపవరం గ్రామంలో సిపిఎం ఎనిమిదో మండల మహాసభ జరిగింది. తొలుత అమరజీవి కొమరం బాబూరావు స్మారక స్తూపం వద్ద సీనియర్ నాయకులు కోర్స జలపాలు పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అక్కడ నుండి మాజీ ఎంఎల్ఎ రుద్రరాజు సత్యనారాయణరాజు (ఆర్ఎస్) నగర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ మహాసభకు తామా ముత్యాలమ్మ, వెట్టి వీరయ్య, పోలోజు నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం మాట్లాడుతూ తాత ముత్తాతల కాలం నుంచి ఏజెన్సీలో ఎల్‌టిఆర్, 1/70 చట్టంలో వేల ఎకరాల భూములను గిరిజనేతరులు అక్రమంగా సాగు చేస్తున్నారన్నారు. చట్టప్రకారం స్థానిక ఆదివాసీలకు హక్కు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు భవితకు భరోసా అంటుందని, కానీ ఆదివాసీలకు భూమితోనే భవిష్యత్తు ఉంటుందని అన్నారు. పోలవరానికి నిధులు విడుదల చేశామని నిత్యం గొప్పలు చెబుతున్నారని, ప్రాజెక్టు నిర్మాణంలో సర్వస్వం కోల్పోతున్న నిర్వాసితులకు పరిహారం, పునరావాసం కల్పించడంలో గత, ప్రస్తుత ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయని విమర్శించారు. తక్షణమే పోలవరం నిర్వాసితులకు పరిహారం, పునరావాసం కల్పించాకే వారిని అక్కడి నుంచి తరలించాలన్నారు. పోలవరం నిర్వాసితులకు పరిహారం, పునరావాసం, యువతకు పరిహారం, ఉపాధి చూపాలన్నారు. లేనిపక్షంలో ఆదివాసీలతో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత, నిధులు ఇవ్వాలన్నారు. ఇప్పటికీ మారుమూల గ్రామాల్లో పాఠశాలలు లేవని, కొన్ని గ్రామాల్లో పాఠశాలలకు కనీసం భవనాలు, వసతులు ఉండటం లేదని అన్నారు. మాతృభాషా విద్యా వాలంటీర్లకు వేతన బకాయిలు, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అనంతరం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టారు. ఈ మహాసభలో నేతలు కోర్స జలపాలు, ఎం.నాగమణి, ఉడతా వెంకటేష్, కొయ్యల శ్రీను, కారం భాస్కర్, చంద్రు బుల్లెమ్మ, ఎం.పోశమ్మ, ఎం.నరేంద్ర, పొడియం రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంతెన సీతారాం



పతాకావిష్కరణలో నేతలు, ప్రతినిధులు

ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలి

ప్రభుత్వాలు డైవర్ట్ రాజకీయాలు ఆపాలి

ప్రజా పోరుయాత్రలో సిపిఎం నగర కార్యదర్శి కిషోర్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రభుత్వాలు డైవర్ట్ పాలిటిక్స్ ఆపి ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని సిపిఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రజా సమస్యలపై చేపట్టిన ప్రజా పోరు యాత్ర ఏలూరు నగరంలో టూ టౌన్ ప్రాంతంలో శనివారం జరిగింది. తంగెళ్లమూడి, తాపీమేస్త్రి కాలనీ, కుమ్మరిరేవు, లంకపేట, రాణినగర్, ఇజ్రాయిల్ పేట, ముస్లింబజార్, కంద్రిక గూడెం, చోడిదిబ్బ ప్రాంతాల్లో జరిగిన వీధి సభల్లో సిపిఎం ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయడంపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. ఐదు నెలలు కావస్తున్నా ఇసుక సమస్య పరిష్కారం కాక నిర్మాణరంగం ఇబ్బందులు ఎదుర్కొంటుందన్నారు. సూపర్ సిక్స్ పథకాల్లో మూడు గ్యాస్ సిలిండర్లు ప్రకటించటం తప్పితే, మరి ఏ ఇతర పథకాన్ని ప్రభుత్వం ఇప్పటివరకు అమలు చేయలేదన్నారు. పైగా గతంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం నూతన మద్యం పాలసీ తీసుకొచ్చి ఊరూర బెల్టుషాపులు పెంచుతుందని విమర్శించారు. మద్యం, డ్రగ్స్, మత్తు పదార్థాల వల్ల రాష్ట్రంలో ప్రతిరోజు ఏదో ఒక ప్రాంతంలో మహిళలు, చిన్నపిల్లలపై సైతం అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలో మహిళలకు భద్రత లేదని స్వయంగా డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ ప్రకటించడం రాష్ట్రంలో శాంతి భద్రతలు ఏ విధంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చున్నారు. మరో పక్క వంట నూనెలు, కూరగాయలు, నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, వీటిని అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. మద్యం లిక్కర్ రూ.99కే అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, వంట నూనెను ఆ రకంగా ధర తగ్గించి ఎందుకు అందించలేకపోతుందని ప్రశ్నించారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం మళ్లీ జమిలి ఎన్నికల డ్రామాకు తెరతీసిందని, బిజెపి సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామని, ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేస్తామని, ప్రతి పేద కుటుంబం ఖాతాలో రూ.15 లక్షలు జమ చేస్తామని పదేళ్ల క్రితం వాగ్దానాలు ఇచ్చిందని, మూడోసారి అధికారంలోకొచ్చాక అయినా బిజెపి ఆ వాగ్దానాల అమలుపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. ఏలూరు నగరంలో శివారు ప్రాంతాల్లో ఇళ్ల పట్టాలు, రోడ్లు, డ్రెయినేజీలు, వీధిలైట్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. నగరంలోని ప్రజలకు తాగునీరు అందటం లేదని, మున్సిపల్ కార్పొరేషన్ ఆర్ఒ సిస్టం ద్వారా రెండు రూపాయలకే 20 లీటర్ల మినరల్ వాటర్‌ను ప్రతి ఇంటికీ అందించాలని డిమాండ్ చేశారు. ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ప్రజా సమస్యలపై ఈ ప్రజా పోరు సిపిఎం కొనసాగిస్తూనే ఉంటుందన్నారు. దానిలో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా సిపిఎం ప్రజా సమస్యలపై ఈ ప్రజా పోరు యాత్ర చేపట్టిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి.జగన్నాథరావు, ఎం.అరుణకుమారి, ఎ.శ్యామలారాణి, జి.శారద, ఏసుబాబు, ఎం.ఎస్సాక్, జె.గోపీ, ఎస్.సత్యనారాయణ, మీసాల సత్యనారాయణ, చల్లా పైడయ్య, పి.సత్తిరాజు, కె.ప్రభు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న సిపిఎం నగర కార్యదర్శి కిషోర్

కౌలు రైతులను ఆదుకోవాలి

చెన్ను రాజారావు కుటుంబానికి రైతు సంఘం నాయకుల పరామర్శ

ప్రజాశక్తి - ముసునూరు

కౌలు వ్యవసాయం చేస్తూ చేతికందిన పంటలు నష్టపోతూ ఆర్థిక ఇబ్బందుల వల్ల చిన్న, సన్నకారు రైతులతో పాటు కౌలు రైతులు చనిపోయే పరిస్థితి కనిపిస్తుందని రైతు సంఘం ముసునూరు మండల నాయకులు సిహెచ్.శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. అప్పుల బాధతో ఆత్మహత్యకు పాల్పడిన చింతలవల్లి శివారు గోగులంపాడు గ్రామానికి చెందిన కౌలు రైతు చెన్ను రాజారావు కుటుంబాన్ని రైతు సంఘం నాయకులు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా సిహెచ్.శ్రీనివాస్ మాట్లాడుతూ చెన్ను రాజారావు గత పదేళ్ల నుంచి సుమారు ఏడు నుంచి పది ఎకరాల వరకు కౌలు వ్యవసాయం చేస్తున్నాడని తెలిపారు. చీడ, పీడ పురుగుల వల్ల, నాసిరకం విత్తనాలు, పెరిగిన ఎరువుల ధరల వల్ల పెట్టిన పెట్టుబడి కూడా రాని పరిస్థితి నెలకొందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలతో పురుగుమందులు, రసాయనిక ఎరువుల ధరలు గత ఐదారేళ్ల నుంచి రెట్టింపయ్యాయన్నారు. కౌలు ధరలు కూడా ఎకరానికి రూ.పది వేల నుంచి ప్రస్తుతం రూ.30 వేలు, రూ.35 వేలు పెరిగిపోయాయన్నారు. కౌలుదారుడు కౌలేకట్టలా? లేక పెట్టిన పెట్టుబడులకు తెచ్చిన అప్పులకు వడ్డీలే కట్టాలా? లేదా కుటుంబ సంసార జీవనం ఎలా సాగించాలా? పలు ఆవేదనలకు మౌనోవేదనకు గురై ఏం చేయాలో దిక్కు దిక్కుతోచని స్థితిలో మద్యంలో కలుపు మందు కలుపుకుని తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడని చెప్పారు. వారసత్వం ద్వారా వచ్చే అరెకరం అమ్మిన బ్యాంకులో తెచ్చిన రూ.పది లక్షలు, బయట తెచ్చిన రూ.7,8 లక్షలకు వడ్డీలే కట్టలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. కనీసం తనకు ఉన్న కుమార్తెను కూడా మర్చిపోయి చనిపోయే పరిస్థితి వచ్చిందన్నారు. కౌలు కార్డు ఉన్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కౌలు రైతులకు బ్యాంకుల్లో రుణాలు ఇవ్వకపోవడం, అప్పుల బాధ తాళలేక పురుగుల మందు తాగే పరిస్థితి ఏర్పడిందని ఆమె భార్య ఆవేదన వ్యక్తం చేసింది. సిపిఎం నాయకులు పిల్లి మురళీ, కొడవలి శ్రీనివాసరావు, గంగుల సత్యం, కుటుంబరావు మాట్లాడుతూ కౌలు రైతు కుటుంబాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని, లేకపోతే మండల వ్యవసాయ, తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నాలు, నిరసనలు, రాస్తారోకోలు చేపడతామని హెచ్చరించారు.



బాధిత కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న నేతలు

జిల్లావ్యాప్తంగా విస్తృతంగా ఎక్సైజ్ దాడులు

వారం రోజుల్లో 95 కేసుల నమోదు

జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఆఫీసర్ ఎ.ఆవులయ్య

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

డైరెక్టర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆదేశాల ప్రకారం గత వారం రోజుల్లో ఏలూరు జిల్లాలోని ఏడు ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో విస్తృతంగా దాడులు నిర్వహించి 95 కేసులు నమోదు చేసినట్లు ఏలూరు జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఆఫీసర్ ఎ.ఆవులయ్య తెలిపారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఏలూరు స్టేషన్ పరిధిలో 13 కేసులు నమోదు చేసి 13 మందిని అరెస్టు చేసినట్లు, 214.89 లీటర్ల మద్యం, 64.35 లీటర్ల బీరు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. 13 కేసుల్లో ఒక నాటు సారా కేసు నమోదు చేసి రెండు లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. చింతలపూడి స్టేషన్ పరిధిలో 16 కేసులు నమోదు చేసి 14 మందిని అరెస్టు చేశామని తెలిపారు. అందులో పది సారా కేసుల్లో ఎనిమిది మందిని అరెస్టు చేశామని, 42 లీటర్ల సారా, 4050 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేశామని, 20.52 లీటర్ల మద్యం స్వాధీనం చేశామని పేర్కొన్నారు. భీమడోలు స్టేషన్ పరిధిలో ఎనిమిది కేసులు నమోదు చేసి ఏడుగురు నిందితులను అరెస్టు చేసినట్లు, 800 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసినట్లు, 19.8 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

జంగారెడ్డిగూడెం స్టేషన్ పరిధిలో 12 కేసులు నమోదు చేసి తొమ్మిది మందిని అరెస్టు చేశామని, అందులో మూడు సారా కేసులు ఉన్నాయని, మూడు లీటర్ల సారా, 600 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేశామని, మద్యం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నూజివీడు స్టేషన్ పరిధిలో 26 కేసులు నమోదు చేసి 20 మందిని అరెస్టు చేసినట్లు, అందులో పది సారా కేసులు ఉండగా నలుగురిని అరెస్టు చేసి 50 లీటర్ల సారా, 3,200 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. ఒక వాహనాన్ని సీజ్ చేసి 43.38 మీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పోలవరం స్టేషన్ పరిధిలో తొమ్మిది కేసులు నమోదు చేసి నలుగురిని అరెస్టు చేశామని, అందులో ఐదు సారా కేసులు ఉండగా రెండు లీటర్ల సారా, 9,200 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేశామని పేర్కొన్నారు. ఒక వాహనాన్ని సీజ్ చేసి 9.72 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కైకలూరు స్టేషన్ పరిధిలో 11 కేసులు నమోదు చేసి 11 మందిని అరెస్టు చేశామని, 20.34 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ దాడుల్లో ఏడు ఎక్సైజ్ స్టేషన్ల ఎస్ఐలు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ టాస్క్ ఫోర్స్ ఎస్ఐ మహమ్మద్ ఆరిఫ్, సిబ్బంది పాల్గొన్నట్లు తెలిపారు.



ఆరబెట్టేందుకు గట్టుపై పోసిన ధాన్యం

సార్వా వరి కోతలు ప్రారంభం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని పలు గ్రామాల్లో సార్వా వరి కోతలు ప్రారంభమయ్యాయి. గురువు గ్రామంలో ముందుగా వెదజల్లిన వరి చేలు కోతకు రావడంతో రైతులు కోతల ఆరంభించారు. గత రెండు రోజులుగా మండలంలోని పెదకామనపూడి, చిగురుకోట, చినకామనపూడి, బొమ్మినంపాడు తదితర గ్రామాల్లో రైతులు యంత్రాలతో కోతలు కోయిస్తున్నారు. స్వల్ప వరి రకం పంటకు రావడంతో రైతులు కోతలు కోస్తూ యంత్రాల ద్వారా పోసిన ధాన్యాన్ని తేమ శాతం తగ్గేందుకు పొలం గట్లపై ఆరబెడుతున్నారు. మండల వ్యాప్తంగా 15 వేల ఎకరాల్లో సార్వా వరి సాగు రైతులు చేపట్టగా, జూన్ నెలలో విత్తనాలు నేరుగా వెదజల్లిన చేలు కోతకు రావడంతో రైతులు పంటను కోసే పనుల్లో నిమగ్నమయ్యారు. ఈ నెల చివరకు మిగిలిన వరి వంగడాలు కూడా కోతకు వస్తాయని రైతులు చెబుతున్నారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

ఏలూరు సర్వజన ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ ఎంఎస్.రాజు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

రోగులకు మెరుగైన సేవలందించాలని, వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఏలూరు సర్వజన ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ ఎంఎస్.రాజు అన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆయన శనివారం ఆసుపత్రిలోని పలు విభాగాలను పరిశీలించారు. ఎముకలు, స్త్రీ ప్రసూతి, అత్యవసర విభాగం, ఓపి విభాగాలతో పాటు సిటీ స్కాను, ఎంఆర్ఐ, ఎక్స్ రే తదితర విభాగాలను పరిశీలించారు. రోగులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవలు, అక్కడ సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. సిటీ స్కాను, ఎంఆర్ఐ విభాగాల వద్ద రోగులు, వారి బంధువులతో మాట్లాడుతూ సరిగా చేస్తున్నారా ఏదైనా ఇబ్బంది ఉందా అని అడిగారు. స్కానింగ్ చేయించుకునేందుకు డబ్బులు అడుగుతున్నారా, ఆలస్యం చేస్తున్నారా అని వారిని అడిగి ఆరా తీశారు. సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, చర్యలు తీసుకుంటానని చెప్పారు.

జిఒ 3ని పునరుద్ధరించాలి

ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి ధర్మరాజు

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్

మండలంలోని 13వ ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం జిన్నెలగూడెం పాఠశాలలో పాయం రమేష్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎటిఎ రాష్ట్ర కోశాధికారి వంజం ధర్మరాజు, జిల్లా ఉపాధ్యక్షులు కారం దారయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వంజం ధర్మరాజు జెండా ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉద్యోగ నియామకాల్లో ఏజెన్సీలో వంద శాతం నియామకాలకు, ప్రమోషన్లు పొందడానికి, జిఒ 3 కోసం సుప్రీంకోర్టులో పిటీ దాఖలు చేసిన ఏకైక సంఘం ఎటిఎ అని తెలిపారు. జిఒ 3ను పునరుద్ధరించి ఏజెన్సీ ప్రాంత వాసులకు ఉద్యోగ నియామకాలు చేపట్టాలని ఆదివాసులందరూ ఏకతాటిపైకి వచ్చి చట్టాన్ని పునరుద్ధరించే వరకు పోరాటం చేస్తామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సిఎం చంద్రబాబు జిఒ 3ని పునరుద్ధరించి హామీని నిలబెట్టుకుని ఆదివాసీలకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎటిఎ నాయకులు పూనెం సీతారామయ్య, బంధం వీరబాబు, మడకం ప్రమీల, కూరం రమేష్, ముత్యాలరావు పాల్గొన్నారు.

ఎఐఎస్ఎఫ్ మహాసభకు తరలిన నాయకులు

ప్రజాశక్తి - చింతలపూడి

రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై మహాసభలో చర్చించి వాటిపై పోరాట కార్యక్రమాన్ని రూపొందిస్తారని ఎఐఎస్ఎఫ్ నాయకులు బి.వినయ్ అన్నారు. ఏలూరులో జరుగుతున్న అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఎఐఎస్ఎఫ్) జిల్లా ప్రథమ మహాసభకు చింతలపూడి పట్టణం నుంచి తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై మహాసభలో చర్చించి వాటిపై పోరాట కార్యక్రమాన్ని రూపొందిస్తారని తెలిపారు. మహాసభకు వెళ్లిన వారిలో సిహెచ్.మణికంఠ, వై.సాయిసీతారాం, ఎస్.వెంకటసాయి, డి.అశోక్, సమీర్, సుమిత్, ఎఐవైఎఫ్ జిల్లా కో-కన్వీనర్ తొర్లపాటి రాజు ఉన్నారు.

నేరాలు - ఘోరాలు

ఉల్లిపాయ బాంబుల పేలుడు ఘటనలో

గాయాలపాలైన వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

దీపావళి పండుగ రోజు ఏలూరులో సంభవించిన ఉల్లిపాయ బాంబుల విస్ఫోటనం ఘటనకు సంబంధించి తీవ్రగాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మరో వ్యక్తి స్థానిక తూర్పువీధికి చెందిన మల్లా పెద్దిరాజు శనివారం తెల్లవారుజామున మృతి చెందారు. స్థానిక తూర్పువీధికి చెందిన పెద్దిరాజు కూలి పనులు చేస్తుంటారు. విస్ఫోటనం జరిగిన సమయంలో అక్కడ దగ్గరగా ఉండంతో తీవ్రంగా గాయపడ్డాడు. గత నెల 31న దీపావళి పండుగ నేపథ్యంలో స్థానిక నవాబుపేట మారుతీనగర్‌కు చెందిన దుర్గాటి సుధాకర్ ద్విచక్ర వాహనంపై ఉల్లిపాయల బాంబుల మూట తెస్తుండగా తూర్పువీధి గౌరీదేవి గుడి సమీపంలో ద్విచక్ర వాహనం కుదుపులకు ఒక్కసారిగా మూటలో ఉన్న బాంబులన్నీ పేలాయి. సుధాకర్ ఘటనా స్థలంలో మృతి చెందిన విషయం తెలిసిందే. ద్విచక్ర వాహనం వెనుక కూర్చున్న సత్యనారాయణపేటకు చెందిన తాబేలు సాయిరామ్‌తో పాటు ఆ సమయంలో ఆ ప్రదేశంలో ఉన్న పెద్దిరాజు మరికొంతమంది గాయాలపాలయ్యారు. దీంతో వీరందరినీ ఆసుపత్రుల్లో చేర్చారు. గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చేరిన సాయిరామ్ చికిత్స పొందుతుండగా, తీవ్రగాయాలపాలై ఏలూరు ఆశ్రం ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న పెద్దిరాజు శనివారం మృతి చెందాడు.

నాటుసారా స్థావరంపై దాడి

ప్రజాశక్తి - చింతలపూడి

నాటుసారా స్థావరంపై దాడి చేసినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ చింతలపూడి సిఐ పి.అశోక్ తెలిపారు. కామవరపుకోట మండలంలోని వడ్లపట్లనూతనం గ్రామంలో నాటుసారా స్థావరంపై దాడి చేయగా పామర్తి వెంకటలక్ష్మి అనే మహిళను అదుపులోకి తీసుకుని ఆమె వద్ద నుంచి ఐదు లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మండల కేంద్రమైన చింతలపూడిలోని సుప్రీంపేట ప్రదేశంలో బెల్ట్‌షాపు నిర్వాహకుడు కారుమంచి సీతారాములు వద్ద నుంచి తొమ్మిది మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని అతనిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ చింతలపూడి ఎస్ఐలు ఆర్‌విఎల్.నరసింహరావు, అబ్దుల్ ఖలీల్, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి - కలిదిండి

అక్రమంగా మద్యం అమ్ముతున్న మహిళపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలోని కొండంగి శివారు పల్లిపాలెంలో శనివారం దాడి చేసిన పోలీసులు గ్రామానికి చెందిన వరలక్ష్మి నుంచి ఏడు మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని ఆమెపై కేసు నమోదు చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్ వైరు చోరీ

ప్రజాశక్తి - టి.నరసాపురం

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పగులకొట్టి కాపర్ వైరు అపహరించిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ కె.వెంకటేశ్వరరావు శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని బొర్రంపాలెం గ్రామానికి చెందిన గుణ్ణం హైమావతి, బాబూరావులకు శింగరాయపాలెంలో ఉన్న పొలంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పగులగొట్టి గుర్తు తెలియని దొంగలు కాపర్ వైరు అపహరించారని విద్యుత్ ఎఇ బొమ్మి శ్రావణ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఒత్తిడి లేని నాణ్యమైన విద్యాబోధనే లక్ష్యం

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించేలా కృషి
ఎపిఆర్ స్కూల్ ప్రిన్సిపల్ బ్రాహ్మణేశ్వరమ్మ

ప్రజాశక్తి - చింతలపూడి

ఆ పాఠశాల విద్యార్థులు చదువులతో పాటు క్రీడల్లో కూడా రాణిస్తున్నారు. 1983లో ప్రారంభమైన ఈ పాఠశాల చదువులో నూరు శాతం ఉత్తీర్ణతతో పాటు ట్రిపుల్ ఐటిలో పది సీట్లు సాధించారు. జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఆ స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారు. ప్రశాంత మైన వాతావరణంలో విద్యాబోధన, ఉపాధ్యాయులపై, విద్యార్థులపై ఒత్తిడి లేకుండా స్వేచ్ఛను ఇవ్వటంతో ఉత్తమ ఫలితలు సాధించాగలుతున్నామని ఎపిఆర్ బాలికల పాఠశాల పిన్సిపల్ ఎం.బ్రాహ్మణేశ్వరమ్మ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె ప్రజాశక్తితో ముచ్చటించారు.

ప్రశ్న : పాఠశాలలో ఎంతమంది విద్యార్థులు ఉన్నారు? వారి విద్యాబోధన ఎలా జరుగుతుంది?

ప్రిన్సిపల్ : ఎపిఆర్ఎస్ స్కూల్లో 482 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రతి ఒక్క విద్యార్థిపై వ్యక్తిగత శ్రద్ధ వహిస్తున్నాము. చదువ్వులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ, వారిని కూడా ముందుకు తీసుకొచ్చే విధంగా కృషి చేస్తున్నాం.

ప్రశ్న : మీరు వచ్చిన సంవత్సరంలోనే ట్రిపుల్ ఐటిలో పది సీట్లు, క్రీడల్లో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవ్వడం పట్ల మీ అభిప్రాయం ఏమిటి?

ప్రిన్సిపల్ : విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన జరగాలనేది నా లక్ష్యం. ఉపాధ్యాయులకు స్వేచ్ఛనిచ్చాను. విద్యార్థులకు ఒత్తిడి లేకుండా ర్యాంకులు సాధించే విధంగా విద్యా బోధన జరగాలని చెప్పాను. విద్యార్థులు చదువులో కాకుండా క్రీడల్లో రాణించే విధంగా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాను. ట్రిపుల్ ఐటిలో పది సీట్లు సాధించడం ఆనందంగా ఉంది. కాని ఈ ఆనందంతో పాటు బాధ్యత కూడా పెరిగింది. బేస్‌బాల్ క్రీడా పోటీల్లో ఇద్దరు విద్యార్థులు జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. ఇది మా ఉపాధ్యాయులు, సిబ్బంది కృషి

ప్రశ్న : పదో తరగతి పరీక్షలకు విద్యార్థులను ఎలా సిద్ధం చేస్తున్నారు?

ప్రిన్సిపల్ : నవంబర్ నెలాఖరికి సిలబస్ పూర్తవుతుంది. ఇప్పటి వరకు 80 శాతం పూర్తయింది. ఉదయం ఐదు నుంచి ఆరున్నర గంటల వరకు, రాత్రి తొమ్మిది నుంచి పది గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. విద్యార్థులకు మానసిక ఒత్తిడి లేకుండా యోగా క్లాసులు నిర్వహిస్తున్నాం. ఇప్పుడు విద్యార్థులకు నూతన సిలబస్ వచ్చింది. దానిపైన దృష్టి పెట్టాం. జులై ఒకటో తేదీ నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం.

ప్రశ్న : ఈ ఏడాది ట్రిపుల్ ఐటిలో ఎన్ని సీట్లు సాధించాలనుకుంటున్నారు? 500 పైగా ఎంతమంది విద్యార్థులు మార్కులు సాధిస్తారు?

ప్రిన్సిపల్ : ఈ ఏడాది ట్రిపుల్ ఐటిలో 20 సీట్లు సాధించాలనుకుంటున్నాము. అందుకు తగ్గట్టుగా విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నాం. చదువు విషయంలో ఎట్టి పరిస్థితుల్లో రాజీపడే ప్రసక్తి లేదు. ఉపాధ్యాయులు ప్రణాళికబద్ధంగా విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్నారు. గతేడాది కంటే ఈ ఏడాది ఎక్కువ మంది విద్యార్థులు, 500 పైగా మార్కులు సాధించాలని మేమందరం కృషి చేస్తున్నాం.



ప్రశ్న : పాఠశాలలో విద్యార్థులు దేనికైనా ఇబ్బందులు పడుతున్నారా?

ప్రిన్సిపల్ : పాఠశాల విద్యార్థులు డైనింగ్ టేబుల్ లేక ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వచ్చిందంటే విద్యార్థులందరూ భోజనం చేయాలంటే నిల్చోని తినాల్సిన పరిస్థితి. అవకాశం ఉంటే నాడు-నేడు కార్యక్రమంలో పెట్టించి విద్యార్థి సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తాం.

ప్రశ్న : విద్యార్థులు ఏఏ క్రీడలపైన ఆసక్తి చూపిస్తున్నారు?

ప్రిన్సిపల్ : విద్యార్థులు కబడ్డీ, అథ్లెటిక్స్, బేస్‌బాల్ క్రీడలపై ఆసక్తి చూపిస్తున్నారు. కబడ్డీ పోటీల్లో కూడా జాతీయస్థాయిలో రాణించిన విద్యార్థులు మా పాఠశాలలో ఉన్నారు.

ప్రశ్న : మీరు పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా ఉన్నప్పుడు విద్యార్థులకు ఏదైనా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారా?

ప్రిన్సిపల్ : విద్యార్థులకు ఎన్‌సిసి విభాగం తీసుకురావాలని నా కోరిక. ఇది ఉన్నతాధికారుల దృష్టిలో కూడా పెడతాను.

ప్రశ్న : విద్యార్థులకు మీరేం చెప్పదలుచుకున్నారు?

ప్రిన్సిపల్ : క్రమశిక్షణతో కూడిన విద్య ఉన్నత స్థానాలకు తీసుకెళ్తుంది. ఇప్పుడు కష్టపడితేనే భవిష్యత్తులో ఉన్నత స్థానంలో ఉంటారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఎంతో కష్టపడి చదివిస్తున్నారు. వారి కష్టాన్ని, నమ్మకాన్ని నిలబెట్టాలి. విద్యార్థులు ఇష్టంగా చదవి ఉన్నత స్థానాలకు ఎదగాలి. ప్రతిఒక్కరూ భవిష్యత్తులో ఉన్నత ఉద్యోగాలు చేయాలని కోరుకుంటున్నాను.

26న కలెక్టరేట్ ఎదుట మహాధర్నా

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు, కార్మికుల హామీలు అమలు చేయాలి
సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల ఐక్య వేదిక డిమాండ్



అభివాదం చేస్తున్న రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఈ నెల 26 రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా రైతాంగం, కార్మికుల పరిష్కారం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హెచ్చరిక నోటీసులు జారీ చేస్తూ కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహించాలని సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల ఐక్య వేదిక జిల్లా సన్నాహక సమావేశం పిలుపునిచ్చింది. చలో కలెక్టరేట్ మహాధర్నా విజయవంతం కోరుతూ సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల ఐక్యవేదిక జిల్లా సన్నాహక సమావేశం ఏలూరులోని సిఐటియు జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపి రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా నాయకులు రాజనాల రామ్మోహన్‌రావు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాసడాంగే, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.బుచ్చిబాబు, ఎఐకెఎస్ రాష్ట్ర అధ్యక్షులు డి.రంగనాథం, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు, బికెఎంయు జిల్లా కార్యదర్శి కె.వసంతరావు, ఆదివాసీ భారత మహాసభ రాష్ట్ర కార్యదర్శి ఎం.రామన్న మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగానికి, కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఢిల్లీ రైతాంగ ఉద్యమం సందర్భంగా లిఖితపూర్వకంగా ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదన్నారు. కార్మిక, కర్షక ఐక్యతతో ఈనెల 26న రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హెచ్చరిక నోటీసులు జారీ చేస్తూ చలో కలెక్టరేట్ మహాధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ మహాధర్నా జయప్రదం కోరుతూ జిల్లా వ్యాప్తంగా ఈ నెల 15వ తేదీ నుంచి 24 వరకు గ్రామ గ్రామాన విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయిం చినట్లు చెప్పారు. ఇప్పటికైనా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగానికి, కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తీసుకురావాలని, కేరళ తరహాలో రైతు రుణ విమోచన చట్టం చేయాలని కోరారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో పనులు 200 రోజులకు పెంచాలని, కనీస వేతనం రూ.600 ఇవ్వాలన్నారు. కార్మికులందరికీ నెలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో ఎపి రైతు సంఘం నాయకులు గుత్తికొండ వెంకటకృష్ణారావు, కట్టా భాస్కరరావు, చేనేత కార్మిక సంఘం నాయకులు కడుపు కన్నయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు నారపల్లి రమణారావు, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు జి.గోపీ, ఆలిండియా లాయర్స్ యూనియన్ నాయకులు కట్టా సత్యనారాయణ, ఎల్ఐసి ఏజెంట్స్ యూనియన్ నాయకులు కనకారావు, నవ్యాంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కె.సుందరరావు, ఆదివాసీ భారత్ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు ఎం.రామిరెడ్డి పాల్గొన్నారు.

ఉమ్మడి పశ్చిమ జిల్లా వ్యాప్తంగా విస్తృత సేవలు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ పురుషోత్తంకుమార్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్



మాట్లాడుతున్న జిల్లా న్యాయమూర్తి పురుషోత్తంకుమార్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తంకుమార్ అధ్యక్షతన శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో న్యాయ సేవాధికార సంస్థ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పురుషోత్తం కుమార్ మాట్లాడుతూ గత నవంబర్ తొమ్మిదో తేదీ నుంచి నేటి వరకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా అనేక కార్యక్రమాలను జిల్లా న్యాయ సేవాధికార సంస్థలు చేపట్టాయని చెప్పారు. లోక్ అదాలత్‌లు నిర్వహించడం, చట్టాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, పేద ప్రజలకు, మహిళలకు, పిల్లలకు, విభిన్న ప్రతిభావంతులు, ప్రకృతి వైపరీత్యాలకు లోనైన ప్రజలకు ఉచిత న్యాయ సహాయం అందిస్తున్నామని తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా అనేక విస్తృత సేవలు జిల్లా న్యాయ సేవాధికార సంస్థతో పాటు పది మండల లీగల్ సర్వీసెస్ కమిటీలు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. గత నవంబర్ తొమ్మిదో తేదీ నుంచి నేటి వరకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా 7670 కేసులను రాజీ చేశామని, ఇందులో 6448 క్రిమినల్ కేసులు, 690 సివిల్ కేసులు, 532 మోటార్ వాహన ప్రమాద బీమా కేసులు, 634 ప్రీ లిటిగేషన్ కేసులు ఉన్నాయని తెలిపారు. 155 మందికి ఉచిత న్యాయవాది ఏర్పాటు, 716 న్యాయ విజ్ఞాన సదస్సులు, ఇతర కార్యక్రమాలను ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా నిర్వహించినట్లు తెలిపారు. రెండో అదనపు జిల్లా జడ్జి పి.మంగాకుమారి మాట్లాడుతూ కేసులను త్వరగా పరిష్కరించడానికి, కక్షిదారులకు నాణ్యమైన సేవలందించడానికి ఈ న్యాయ సేవాధికార సంస్థలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కక్షిదారులు ఈ సేవలను ఉపయోగించుకుని కేసుల నుంచి త్వరగా ఉపశమనం పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్, ప్రిన్సిపల్, సీనియర్ సివిల్ జడ్జి ఐ.శ్రీనివాసమూర్తి, అదనపు సీనియర్ సివిల్ జడ్జి కెకెవి.బులికృష్ణ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.వాసుదేవ్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్, పిపి. కోనే సీతారాం పాల్గొన్నారు.

కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు

నూజివీడు టౌన్ : నూజివీడు సిద్ధార్థ కాలేజీలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఐ.సత్యప్రకాష్ ఆధ్వర్యంలో జాతీయ న్యాయ సేవాధికార సంస్థ దినోత్సవం సందర్భంగా శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.శివపార్వతి హాజరై మాట్లాడుతూ పేదలు, మహిళలు, అక్రమ రవాణా బాధితులు, బలహీన తరగతులకు చెందిన ప్రజలు ఉచిత న్యాయ సలహా సహాయ కేంద్రాలకు అర్హులన్నారు. లోక్ అదాలత్‌లో ఇచ్చే తీర్పులు సుప్రీంకోర్టు తీర్పులతో సమానమన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి మధు రవిశంకర్, సీనియర్ న్యాయవాది బసవరాజు రామకృష్ణ, జాన్‌బాబు, నండూరి పద్మాంజలి, సిద్ధార్థ విద్యాసంస్థల అధినేత గొల్లపూడి రవిబాబు, ప్రిన్సిపల్ శ్రీమన్నారాయణ, లీగల్ సర్వీసెస్ కమిటీ సిబ్బంది, పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భార్గవికి రాయల్ క్లబ్ ఆర్థిక సాయం

ప్రజాశక్తి - చింతలపూడి

మండల కేంద్రమైన చింతలపూడి గ్రామానికి చెందిన విశ్వనాథరావు సూర్యనారాయణ కుమార్తె భార్గవి నేషనల్ అథ్లెటిక్స్ డిస్కస్ త్రో అండర్-19 పోటీల్లో పాల్గొనేందుకు జార్ఖండ్ రాష్ట్రంలో రాంచీ వెళ్లేందుకు అవసరమైన ఖర్చులకు రూ.13,500 చింతలపూడి రాయల్ క్లబ్ వారు అందించారు. భార్గవి ఆలిండియా స్థాయిలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నిర్వహించిన అథ్లెటిక్స్ అండర్ 18 పోటీల్లో జావెలిన్ త్రో, షాట్ పుట్ రెండింట్లో బంగారు పతకాలు సాధించింది. రాష్ట్ర స్థాయి జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జావెలిన్ త్రో పోటీల్లో పతకం సాధించింది. రాష్ట్ర స్థాయి సౌత్ జోన్ జావెలిన్ త్రో పోటీల్లో పతకం సాధించింది. ఈ కార్యక్రమంలో రాయల్ క్లబ్ అధ్యక్షుడు ఊసా సుబ్బారావు, సెక్రటరీ కురిసెట్టి విజయ్‌కుమార్, ట్రెజరర్ ఆకుల రమేష్, గౌరవ అధ్యక్షులు కొండపల్లి శేషగిరిరావు, గంధం శ్రీనివాసరావు, గంధం రామమోహన్‌రావు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - మండవల్లి

గ్రామాల్లో రహదారుల ఏర్పాటుతోనే అభివృద్ధి కనిపిస్తుందని కూటమి నాయకులు చాపరాల దుర్గాప్రసాద్ అన్నారు. మండలంలోని పెరిగేగూడెంలో పల్లె పండుగ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్డుకు ఆయన శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ఐదేళ్ల పాలనలో రహదారుల అభివృద్ధిపై దృష్టి పెట్టిన దాఖలాలు లేవన్నారు. దీంతో రహదారులు పూర్తిగా ధ్వంసం అయిపోయాయని తెలిపారు. అధికారంలోకొచ్చిన ఆరు నెలల్లోనే కూటమి ప్రభుత్వం రహదారులపై దృష్టి పెట్టి నిర్మిస్తుందన్నారు. గ్రామాల్లో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో సిఎం చంద్రబాబు నాయుడు ముందుకు సాగుతున్నారన్నారు. గ్రామాలాభివృద్ధి కూటమి ప్రభుత్వం ముఖ్య లక్ష్యమన్నారు. అన్ని తరగతుల ప్రజల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు నారాగాని నాగేశ్వరరావు, ఎల్‌కె.రాంబాబు, సర్వేశ్వరరావు, సత్యనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శుక్లబోయిన రాంబాబు డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల మండల కమిటీ సమావేశం సిహెచ్.విజయకాంతం అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ అనేక స్కూళ్లలో ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో లేవన్నారు. పాఠశాలల్లో వంట షెడ్లు, తాగునీరు, గ్యాస్ సరఫరా వంటి మౌలిక సదుపాయాల కల్పనలో ప్రభుత్వాలకు శ్రద్ధ లేదన్నారు. పథకాన్ని ప్రయివేట్ సంస్థలకు అప్పగించకూడదన్నారు. కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. ధరల పెరుగుదలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచాలన్నారు. ఈ సమావేశంలో పి.ప్రియాంక, ఎ.అంజలీదేవి, చెల్లాయమ్మ, కె.సంకురమ్మ, ఎస్.నాగమ్మ, కె.ధనలక్ష్మి, జి.దుర్గ, జి.నాగమాధవి పాల్గొన్నారు.

సిపిడబ్ల్యుఎస్‌కు విద్యుత్ సరఫరా సమస్య

తాగునీటికి ఇబ్బందుల్లేకుండా చర్యలు : ఎంఎల్ఎ ధర్మరాజు

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురం వద్ద సిపిడబ్ల్యుఎస్ పథకం ద్వారా తాగు నీరందించే ప్రాజెక్ట్ వద్ద విద్యుత్ సరఫరాకు సంబంధించిన కేబుల్ మరమ్మతులకు గురైంది. లో ఓల్టేజీ సమస్య తలెత్తడంతో నిడమర్రు మండలం దేవర గోపవరం, పెదనింద్రకొలను, చిన నింద్రకొలను (పత్తేపురం), తోకలపల్లి, బైనేపల్లి, ఆముదలాపల్లి గ్రామాలకు తాగు నీరు సరఫరాలో ఇబ్బంది అవుతోంది. ఈ నేపథ్యంలో ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు, ఎలక్ట్రికల్ డిఇ అంబేద్కర్ నారాయణపురం వాటర్ ప్రాజెక్ట్ వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, కేబుల్స్‌ను పరిశీలించారు. తక్షణమే లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుని ఆరు గ్రామాలకు తాగునీరు సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టారు.



ట్రాన్స్‌ఫార్మర్ పరిశీలిస్తున్న ఎంఎల్ఎ, విద్యుత్ శాఖ డిఇ

పాఠశాలలో అపరిశుభ్ర వాతావరణాన్ని తొలగించాలి

ప్రజాశక్తి - మండవల్లి

పాఠశాలలో అపరిశుభ్ర వాతావరణం నెలకొని చిన్నారులు ఇబ్బందులకు గురవుతుంటే అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన శనివారం పాఠశాలను పరిశీలించి మాట్లాడారు. జాతీయ రహదారి విస్తరణలో మండవల్లి సెంటర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల-1లో ప్రహరీ గోడను తొలగించడంతోపాటు చెట్లను నరికి వాటిని తొలగించకుండా అక్కడే ఉంచడంపై పాఠశాల వెనుక భాగంలో పూర్తిగా అపరిశుభ్ర వాతావరణం నెలకొందన్నారు. అంతేకాకుండా ఈ మధ్యకాలంలో కురిసిన వర్షాలకు నీరు పాఠశాల వెనుక భాగంలో ఉన్న లోతట్టు ప్రాంతంలో చేరి దుర్వాసన వెదజల్లుతూ దోమల వ్యాప్తికి ఆవాసంగా మారిపోయిందన్నారు. అధికారులు అటు దిశగా కన్నెత్తి చూడకపోవడం బాధాకరమని అన్నారు. ప్రహరీ గోడ లేకపోవడంతో పాఠశాలలో కుక్కలు, ఆవులు, మేకలు, పందులు స్వైర విహారం చేస్తుండడంతో చిన్నారులపై ఏ విధంగా దాడి చేస్తాయో తెలియని భయాందోళన చెందాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చిన్నారులకు రక్షణ కల్పించేలా ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టి పాఠశాల వెనుక భాగంలో నెలకొన్న అపరిశుభ్ర వాతావరణన్ని వెంటనే తొలగించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ అధ్యక్షులు అప్పారావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని అక్కిరెడ్డిగూడెం గ్రామంలో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు రమణక్కపేట సబ్‌స్టేషన్ విద్యుత్ ఎఇ సుబ్బారావు తెలిపారు. మండలంలోని అక్కిరెడ్డిగూడెంలో వ్యవసాయ వినియోగదారులకు ఉదయం ఆరు గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు త్రీఫేస్ కరెంటు ఇవ్వనున్నట్లు చెప్పారు. మూడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు విద్యుత్ సరఫరా మరమత్తుల నిమిత్తం నిలిపివేయనున్నట్లు తెలిపారు.

నల్ల చట్టాల రద్దుకు పోరాడాలి : సిపిఐ

ప్రజాశక్తి - చింతలపూడి

సత్యనారాయణరెడ్డి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలంటే మూడు నల్ల చట్టాలను రద్దు చేయించేంతవరకూ పోరాటమే మార్గంగా రైతాంగం ఉద్యమించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య అన్నారు. మండలంలోని ఎర్రగుంటపల్లిలో సత్యనారాయణరెడ్డి 28వ వర్ధంతి సభ పి.సోమశేఖర్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సభలో కృష్ణచైతన్య మాట్లాడుతూ స్వతంత్ర సమరయోధులు, తెలంగాణ సాయుధ పోరాట యోధులు, చింతలపూడి ఏరియా కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత సత్యనారాయణ రెడ్డిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. చింతలపూడి ప్రాంతంలో 1941లో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంలో ప్రముఖ పాత్ర పోషించారన్నారు. బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు నల్ల రైతాంగ చట్టాల వల్ల రైతాంగానికి అనేక ఇబ్బందులు ఏర్పడతాయన్నారు. వాటిని రద్దు చేస్తానని హామీ ఇచ్చిన మోడీ మళ్లీ వాటి అమలుకు పూనుకుంటున్నారన్నారు. అవి రద్దయ్యేంతవరకూ రైతాంగం సత్యనారాయణరెడ్డిని స్ఫూర్తిగా తీసుకుని పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ వర్ధంతి సభలో సిపిఐ మండల కార్యదర్శి, సహాయ కార్యదర్శి తొర్లపాటి బాబు, జంగా రామచంద్రారెడ్డి, దంతా కృష్ణ, మండల వైస్ ప్రెసిడెంట్ వరలక్ష్మి, శాఖ సభ్యులు పుల్లూరి శ్రీరామాచారి, తలారి గంగరాజు, కొల్లి వీరవెంకటరెడ్డి, ముత్తారెడ్డి రామారావు పాల్గొన్నారు.

హాస్టళ్లు శుభ్రం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు ఆర్‌జియుకెటి బాలుర హాస్టళ్లలో 150 మంది వర్కర్స్‌తో మెగా క్లీనింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 150 మంది వర్కర్స్ విద్యార్థుల హాస్టల్ గదులను శుభ్రం చేశారు. పనులను విశ్వవిద్యాలయ రిజిస్టర్, నూజివీడు డైరెక్టర్ ఆచార్య ఎస్.అమరేంద్ర, ఎఒ డాక్టర్ లక్ష్మణ్ పర్యవేక్షించారు. స్టూడెంట్ వెల్ఫేం విభాగం, హౌస్ కీపింగ్ సెక్యూరిటీ విభాగం, సూపర్‌వైజర్లు, కేర్ టేకర్లు పాల్గొని విజయవంతం చేశారు.

విద్యారంగ పరిరక్షణకు పోరాడాలి : ఎఐఎస్ఎఫ్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రభుత్వ విద్యారంగా పరిరక్షణకు సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శివారెడ్డి పిలుపునిచ్చారు. ఎఐఎస్ఎఫ్ ఏలూరు జిల్లా ప్రథమ మహాసభ డి.శివకుమార్ అధ్యక్షతన స్థానిక స్ఫూర్తి భవన్‌లో శనివారం నిర్వహించారు. తొలుత ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి నుంచి ఆర్ఆర్.పేట, మున్సిపల్ పార్కు నుంచి ఎఐఎస్ఎఫ్ ప్రథమ మహాసభ సభ ప్రాంగణం స్ఫూర్తి భవన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సిపిఐ ఏలూరు జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనం వద్ద ఎఐవైఎఫ్ పతాకాన్ని జిల్లా మాజీ కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య ఆవిష్కరించారు. అనంతరం నిర్వహించిన ఎఐఎస్ఎఫ్ ప్రథమ మహాసభలో కె.శివారెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యను కాషాయీకరణ, కార్పొరేటీకరణ, ప్రయివేటీకరణ చేయడానికి ప్రయత్నిస్తుందన్నారు. నూతన విద్యా విధానం పేరుతో అమలు చేస్తున్న విధానాల వల్ల రాష్ట్రంలో, దేశంలో 25 లక్షల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు, ఉన్నత పాఠశాలాలు మూత వేయడానికి కుట్ర పన్నుతుందని విమర్శించారు. సీట్ల కోత కారణంగా కేంద్ర విశ్వవిద్యాలయాలలో పేద విద్యార్థులు విశ్వవిద్యాలయ చదువుకు దూరమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పాఠశాలలు ప్రారంభమై ఆరు నెలలు కావస్తున్నా తల్లికి వందనం, ఫీజు రియంబర్స్‌మెంట్ పథకం నేటికీ అమలు కాలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కోశాధికారి ఎం.సాయికుమార్, డి.శివకుమార్, యర్రా మధు, నాని, అశోక్ కుమార్, లోకేశ్వరి, లావణ్య, రాజ్యలక్ష్మి, శాంతి పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమగోదావరి జిల్లా గణపవరం మండలం కోమర్రు గ్రామ కాపురస్తులైన విప్పర్తి వెంకటలక్ష్మి భర్త సతీష్ అను నేను నా యొక్క పాస్ పోర్టు గణపవరం SBI సెంటర్లో జిరాక్స్ తీయించుకొని మా ఇంటికి వచ్చే మార్గమధ్యలో పాస్ పోర్టు నెంబరు X0579498 గల పాస్ పోర్టు మరియు జిరాక్స్‌తో సహ కవర్లో పెట్టుకుని మా ఇంటికి వచ్చే మార్గ మధ్యలో ఎక్కడ పడిపోయిందో తెలియదు. ఎంత వెతికిన దొరక లేదు దొరికినవారు ఈ కింది ఫోన్ నెంబర్‌కు తెలియజేయవలసినదిగలరు.

విప్పర్తి వెంకటలక్ష్మి, భర్త సతీష్ కోమర్రు
గ్రామం గణపవరం మండలం,
పశ్చిమగోదావరి జిల్లా. సెల్ 9032811886